
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

ఆదివారం 18 మే 2025

'భూభారతి'తో రైతులకు మేలు
- మా స్వార్థం కోసం చట్టాన్ని తేలేదు
- కొత్తగా సర్వేయర్లను నియమిస్తున్నాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

6

- చిలప్‌చెడ్ పేరుకే మండలం.. ఒక్క ప్రభుత్వ భవనమూ లేదు : ఎంపీ రఘునందన్





కొండాపూర్‌లో భూసమస్య పరిష్కార పత్రాలు అందజేస్తున్న మంత్రులు పొంగులేటి, దామోదర, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

అన్నిరకాల భూసమస్యలకు పరిష్కారం

- కొండాపూర్ భూభారతి సదస్సులో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం : మంత్రి దామోదర
- సదస్సులో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, మే 17 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం ద్వారా అన్ని రకాల భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కొండాపూర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన భూభారతి పైలెట్ ప్రాజెక్టు సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో 32 మండలాలను పైలెట్ ప్రాజెక్టు మండలాలుగా ఎంపిక చేశామని, అందులో కొండాపూర్ ఒకటని చెప్పారు. త్వరలోనే ఈ మండలంలోని గ్రామాల్లో భూసమస్యలు పరిష్కారమవుతాయని, అదే విధంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ భూభారతిని క్షేత్రస్థాయిలో అమలు చేస్తామని వివరించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని తెలిపారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ పరితోష్ పంకజ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెయ్యి ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు

- గజ్వేల్ నియోజకవర్గంలో ఏర్పాటు : టీజీఐఐసీ ఈడీ నిఖిల్ చక్రవర్తి

గజ్వేల్/ములుగు/జగదేవ్‌పూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో వెయ్యి ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు టీజీఐఐసీ ఈడీ నిఖిల్ చక్రవర్తి ప్రకటించారు. నియోజకవర్గంలోని ములుగు మండలం కొత్తూరు, తునికిబొల్లారం, వర్గల్ మండల కేంద్రం, జగదేవ్‌పూర్ మండలంలోని పీర్లపల్లి గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించి, టీజీఐఐసీ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని, అందులో భాగంగా ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించిన వివరాలను సేకరింమామని తెలిపారు. పలు అంశాలపై ఆయనకు అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ వివరాలను అందజేశారు. వారివెంట జీడిమెట్ల జోనల్ మేనేజర్ అనురాధ, టీజీఐఐసీ డీజీఎంలు రామ్‌దేవ్, నాగరాజు, తహసీల్దార్లు ఆరీఫా, నిర్మల తదితరులున్నారు.



ములుగు మండలంలో టీజీఐఐసీ స్థలాలను పరిశీలిస్తున్న ఈడీ నిఖిల్ చక్రవర్తి

వికాసం ఎవరికో?

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన
మే 31 నాటికి అర్హుల ఎంపిక
జూన్ 2న రుణ పత్రాలు అందించేందుకు సన్నాహాలు
సిబిల్ స్కోర్ ఆధారంగా మంజూరు
ఎదురుచూస్తున్న ఆశావహులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 17 : నిరుద్యోగ యువత ఆర్థికంగా రాణించేందుకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారికి అండగా నిలవాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఏప్రిల్ 14న దరఖాస్తుల గడువు ముగిసింది. ఈ దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. మే31 వరకు అర్హుల జాబితా వెల్లడికానున్నట్లు తెలిసింది. రాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న అట్టహాసంగా అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా అధికారులు కసరత్తును ప్రారంభించారు.

జిల్లాలో దరఖాస్తులు 59,683

మార్చి 17న దరఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం కాగా, ప్రభుత్వం తొలుత ఏప్రిల్ 5న చివరి తేదీగా గడువును విధించింది. కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీలో ఆలస్యం నెలకొనడంతో గడువును ఏప్రిల్ 14కు పొడిగించారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 59,683 దరఖాస్తులు రాగా, వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నెల 31 నాటికి అర్హులు ఎవరో అధికారులు తేల్చేపనిలో పడ్డారు. ఈ మేరకు దరఖాస్తులను అధికారులు పరిశీలించి వాటిని సంబంధిత బ్యాంకులకు పంపిస్తున్నారు. వాటిని బ్యాంకు సిబ్బంది పరిశీలించి సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలను మంజూరు చేయనున్నారు. గతంలో ప్రభుత్వం నుంచి ఏమైనా రుణ సహాయం పొందారా, ఆర్థికంగా బ్యాంకుల్లో జరిపిన లావాదేవీలపై ఆరా తీస్తున్నారు. గతంలో ఏదైనా రుణ సహాయం పొందితే దరఖాస్తులను పరిగణలోకి తీసుకోరు. జూన్ 2న అర్హులకు రుణ సదుపాయం చెక్కులను అందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించడంతో, తుదిజాబితాలో ఎవరి పేరు వస్తుందోనని దరఖాస్తుదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



సిద్దిపేటలోని మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగులు (ఫైల్)

కలెక్టర్ నేతృత్వంలో ఎంపిక కమిటీ

ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మే 31 వరకు అర్హులేవరో అధికారులు పరిశీలించి, జూన్ 2న అధికారికంగా లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను అందించనున్నారు. అందుకు గాను అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు కమిటీని నియమించింది. కమిటీలో చైర్‌పర్సన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా డీఆర్డీఏ పీడీ, అదనపు కలెక్టర్, సభ్యులుగా ఇండ్రస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ జనరల్ మేనేజర్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు, మైనారిటీ వెల్ఫేర్ అధికారి, డిజబుల్డ్ వెల్ఫేర్ ఏడీ, డబ్ల్యూ అండ్ సీడీ పీడీ, ట్రైబల్ వెల్ఫేర్ డీటీడీవో, లీడ్ జిల్లా మేనేజర్‌లు ఉండనున్నారు. వీరి ఆధ్వర్యంలోనే అర్హుల తుది ఎంపిక చేపట్టనున్నారు.

దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

మంత్రి పొంగులేటిని కోరిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాక, మే 17 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలంటూ శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు కోరారు. శనివారం నర్సాపూర్‌లో నిర్వహించిన భూభారతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు ఎంపీ వినతిపత్రం అందజేశారు. దుబ్బాక, తొగుట, మిరుదొడ్డి, రాయపోల్, దౌల్తాబాద్, అక్బర్‌పేట-భూంపల్లి మండలతో కలిపి కొత్త రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గతంలోనే తాలుకాగా, సంస్థానంగా దుబ్బాక వెలుగొందిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ తెలిపారు.



గుల్లపల్లి యాదగిరిరావు(ఫైల్)







కల్వకోట సురేందర్‌రావు (ఫైల్)

సరిలేరు మీకెవ్వరు

గజం స్థలం వదులుకోవాలంటే ఒకటికి వందసార్లు ఆలోచించుకోవడంతో పాటు సంబంధ, బాంధవ్యాలను తుంచేసుకుని ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రస్తుత సమాజానికి ఆ మామాఅల్లుళ్లు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉన్న ఊరి భవిత ముఖ్యమని, ఆనాటి కాలంలో 30 ఎకరాలను విరాళంగా అందించి చేర్యాల అభివృద్ధికి బీజం వేశారు. వారే పట్వారీలు గుల్లపల్లి తిరుమల యాదగిరిరావు, కల్వకోట సురేందర్‌రావు.

చేర్యాల అభివృద్ధి ప్రదాతలు ఈ మామాఅల్లుళ్లు

విలువైన స్థలాల విరాళం అందజేసిన పట్వారీలు
గ్రామదేవతల ఆలయాలకు స్థలాలిచ్చిన దాతలు
వారి కృషిని నేటి తరానికి తెలిసేలా చేయాలని కుటుంబీకుల కోరిక

చేర్యాల, మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రజల చెంతకు చేర్చడానికి కార్యాలయాలే ప్రధాన వేదికలు. అటువంటి కార్యాలయాల ఏర్పాటుకు అనువుగా విలువైన భూములను విరాళంగా అందించి దాతృత్వంలో తమకెవరు సాటిలేరనిపించుకున్నారు గుళ్లపల్లి తిరుమల యాదగిరిరావు, కల్వకోట సురేందర్‌రావు. వారు విరాళంగా ఇచ్చిన భూముల్లోనే ప్రస్తుతం చేర్యాల ఆర్టీసీ బస్టాండు, వ్యవసాయ మార్కెట్‌యార్డు, ఎంపీడీవో కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇంటిగ్రేడెట్ హాస్టల్, పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటయ్యాయి. గ్రామదేవతల ఆలయాలు వారి హయాంలోనే పురుడుపోసుకున్నాయి.

యాదగిరిరావు ప్రస్థానం

గుళ్లపల్లి తిరుమల యాదగిరిరావు 1922లో జన్మించారు. పట్వారీ కుటుంబానికి చెందిన ఆయన చిన్నతనం నుంచే సామాజిక, ఆధ్యాత్మిక, రాజకీయ, సాంఘిక విలువలతో ఎదిగారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కాంగ్రెస్‌వాదీగా చురుకైన పాత్ర పోషించారు. పలు కవితలు రాసి చైతన్య పరిచారు. చేర్యాల గ్రంథాలయ అధ్యక్షుడిగా విద్యావ్యాప్తికి కృషి చేశారు. కొమురవెల్లి మల్లన్న దేవస్థాన కమిటీ కార్యదర్శిగా వ్యవహరించారు. చేర్యాల ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలం అవసరం కావడంతో తన సొంత స్థలాన్ని విరాళంగా అందించారు. చేర్యాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు సుమారు 16 ఎకరాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 6 ఎకరాలు అందజేశారు. ఆయా భూముల్లో ప్రస్తుతం జూనియర్ కళాశాల, పక్కనే ఎస్సీ బాలుర హాస్టల్, ఇంటిగ్రేటెడ్ హాస్టల్, ఇంటిగ్రేటెట్ ఆఫీస్ కాంప్లెక్స్ బిల్డింగ్‌లను నిర్మించారు. మార్కెట్ యార్డుకు ఇచ్చిన స్థలంలో గోదాములు, పాల శీతలీకరణకేంద్రం, టూరిజం గెస్ట్‌హౌజ్‌లను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం అక్కడ ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు.



సండే స్పెషల్
Sunday Special

అంతేకాకుండా ప్రజలను కాపాడే గ్రామ దేవతలైన మహంకాళమ్మ ఆలయాలకు భూములు విరాళంగా అందించారు.

మామ ఆదర్శంతో అల్లుడు

మామ యాదగిరిరావు ఆదర్శంతో అల్లుడు పట్వారీ అయిన కల్వకోట సురేందర్‌రావు భూములను విరాళంగా అందజేసి, చేర్యాల అభివృద్ధిలో కీలకభూమిక పోషించారు. వారసత్వంగా కవిత్వంలో రాణించడంతో పాటు దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆర్టీసీ బస్టాండు నిర్మాణానికి రెండెకరాలు, ఎంపీడీవో కార్యాలయానికి 2.20 ఎకరాల స్థలం ఇచ్చారు. ఆ స్థలంలో ఎమ్మార్సీ కార్యాలయం, శ్రీనిధి ఐకేపీ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ తదితర కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని కోర్టుకు కేటాయించారు. అలాగే

మిగతా 8వ పేజీలో

సౌదీలో చిక్కుకున్న విద్యార్థి నాయకుడు

- స్వగ్రామానికి రప్పించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు సాయం

గజ్వేల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం సౌదీ దేశానికి వెళ్లి చిక్కుకున్న విద్యార్థి నాయకుడు భారత్‌కు వచ్చేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు సాయం చేశారు. గజ్వేల్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు నవాజ్ ఉపాధి నిమిత్తం ముంబైలో ఉన్న ఏజెంట్ ద్వారా గత నెలలో సౌదీకి వెళ్లాడు. ఏజెంట్ మోసం చేయడంతో అక్కడే చిక్కుకుపోయిన నవాజ్ తనను కాపాడాలని వాట్సాప్ ద్వారా మాజీ మంత్రి హరీశ్‌రావును విజ్ఞప్తి చేశారు. తక్షణమే స్పందించిన హరీశ్‌రావు అక్కడున్న ఏజెంట్‌తో మాట్లాడి నవాజ్‌ను వెనక్కు పంపించాలని కోరారు. అంతేకాకుండా నవాజ్ ఇండియాకు రావడానికి కావాల్సిన టికెట్, తగిన ఆర్థిక సహాయం ఆయన తండ్రి మహబూబ్‌అలీకి అందించారు. నవాజ్‌ను ఇండియాకు తీసుకువచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేస్తానని, అధైర్యపడవద్దని, అండగా ఉంటానని హరీశ్‌రావు ఫోన్‌లో ధైర్యం చెప్పారు.

మా భూమి కబ్జా చేస్తున్నారు

సాదాబైనామాతో కొన్నాం.. కబ్జాలో ఉన్నాం
ఆర్మీ జవాన్ ఆవేదన

దుబ్బాక, మే17 (ఆంధ్రజ్యోతి) : సాదాబైనామాతో ఆ జవాన్ కుటుంబం వ్యవసాయ భూమి కొనుగోలు చేసింది. మూడు దశాబ్దాలుగా ఆ భూమిలో ఆ కుటుంబమే కబ్జాలో ఉంటూ బోర్లు తవ్వించి సాగు చేసుకుంటోంది. అయితే, ఆ భూమిని అమ్మిన వారు మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో ఆ జవాన్ తన భూమి కబ్జాకు గురైందని 'ఎక్స్' వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. దుబ్బాక మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన బూరు రామస్వామి ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 406లో బాల్ రాజవ్వ, లక్ష్మయ్య నుంచి జవాన్ బూరు రామస్వామి తండ్రి బూరు వెంకటయ్య 1992లో ఎకరం 16 గుంటల భూమిని సాదాబైనామా ద్వారా కొనుగోలు చేశారు. వెంకటయ్య దుబాయ్‌కు వెళ్లడంతో రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోయాడు. అప్పటి నుంచి ఆ కుటుంబమే కబ్జాలో ఉంటూ సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం భూముల ధరలు పెరగడంతో భూమిని అమ్మిన వారు అదే గ్రామానికి చెందిన ఓ వీఆర్వో సోదరుడికి రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో జవాన్ కుటుంబం కోర్టును ఆశ్రయించగా, యథాస్థితిని కొనసాగించాలని కోర్టు సూచించింది. అయితే, వీఆర్వో సోదరులు జవాన్ కుటుంబసభ్యులను బెదిరించి ఆ భూమి కబ్జాలోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జవాన్ బూరు రామస్వామి శనివారం ఎక్స్ వేదికగా తన ఆవేదనను వెలిబుచ్చారు. తమకు న్యాయం చేయాలని కోరారు.





సాదా బైనామా పత్రాలను చూపుతున్న జవాన్ తల్లిదండ్రులు, సైనికుడు రామస్వామి

స్పందించిన హరీశ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి

మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించి బాధిత జవాన్‌కు అండగా ఉంటామని ఎక్స్ వేదికగా భరోసా కల్పించారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. చట్టబద్ధంగా 13బీ ప్రకారం అధికారులకు పట్టాఇచ్చే అవకాశం ఉంటుందని, దేశం కోసం పనిచేస్తున్న జవాన్ కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. ఈ విషయమై స్పందించిన కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి దేశం కోసం పోరాడుతున్న జవాన్ కుటుంబానికి న్యాయం జరగకపోవడం మంచిదికాదని తెలిపారు. తాను నేడు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి జవాన్ కుటుంబానికి న్యాయం చేయాలని, వారి భూమి వారికి ఇప్పించేలా ఆదేశాలివ్వాలని కోరుతానని ఆయన తెలిపారు. ఈ విషయమై కలెక్టర్‌తో కూడా మాట్లాడినట్టు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

బాల్య వివాహాలు నేరం

- ఐసీడీఎస్ సీడీపీవో సరిత



పటాఫట్

గజ్వేల్, మే 17 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా బాల్య వివాహాలు జరిపిస్తే చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ గజ్వేల్ సీడీపీవో సరిత హెచ్చరించారు. గజ్వేల్ ప్రాజెక్టు పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలను 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

గజ్వేల్ ప్రాజెక్టు పరిధిలో క్లస్టర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు ఎన్ని?

గజ్వేల్ ప్రాజెక్టు పరిధిలో ఏడు మండలాల పరిధిలో మొత్తం 11 క్లస్టర్లు ఉండగా, అందులో పది మంది సూపర్‌వైజర్లు ఉన్నారు. 278 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 247 మంది అంగన్‌వాడీ టీచర్లు, 200మంది ఆయాలు పనిచేస్తున్నారు. 20,529 మంది పిల్లలు ఉండగా అందులో ఆరు నెలల లోపల పిల్లలు 1,485, ఏడు నెలల నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలు 8,967, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 10,255 మంది ఉన్నారు. అంతేకాకుండా 1,661 మంది గర్భిణులు, 1,485 మంది బాలింతలు ఉన్నారు.

పౌష్టికాహారం అందిస్తున్నారా?

ప్రాజెక్టు పరిధిలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఆరోగ్య లక్ష్మి కార్యక్రమంలో భాగంగా రోజు 150 గ్రాముల అన్నం, 30 గ్రాముల బాలామృతం, 2.5 కేజీల నూనె, 200 మిల్లీలీటర్ల పాలు, 16 గుడ్లు అందిస్తున్నాం. అక్షరభ్యాసం, అన్నప్రసాన, గర్భిణీ స్త్రీలను ఆహ్వానించడం, సీమంతాలు నిర్వహించడం, పోషకాహార లోపం లేకుండా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ నెలలో పోషణపక్వాడ, ఆగస్టులో తల్లిపాల వారోత్సవాలు, సెప్టెంబరులో పోషణమాసం కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

బాల్య వివాహాల నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి ?

ఏడాది కాలంలో ఎనిమిది బాల్య వివాహాలను అడ్డుకున్నాం. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడ బాల్యవివాహాలకు సంబంధించిన సమాచారం అందినా వెంటనే స్పందించి తల్లిదండ్రులకు, బంధువులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

టేక్మాల్, మే 17 (ఆంధ్రజ్యోతి): వాహనం బైక్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామ శివారులో శనివారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. వట్‌పల్లి మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన నర్సింలు(43) అనే వ్యక్తి జోగిపేట వైపు నుంచి బొడ్మట్‌పల్లి వైపు బైక్‌పై రాంగ్‌రూట్‌లో వెళ్తున్నాడు. ఈ క్రమంలో తుఫాన్ వాహనం ఢీకొనడంతో నర్సింలుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.







'భూభారతి'తో రైతులకు మేలు

- మా స్వార్థం కోసం చట్టాన్ని తేలేదు
- కొత్తగా సర్వేయర్లను నియమిస్తున్నాం.. మంత్రి పొంగులేటి
- చిలప్‌చెడ్ పేరుకే మండలం, ఒక్క ప్రభుత్వ భవనమూ లేదు: మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- ధరణితోనే భూసమస్యల పరిష్కారం: ఎమ్మెల్యే సునీతారెడ్డి



చిలప్‌చెడ్ రైతు వేదిక ప్రాంగణంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందజేస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలప్‌చెడ్, మే 17(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టాన్ని మా స్వార్థం కోసం తీసుకురాలేదని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రైతుల మేలు చేసేందుకే తెచ్చామని రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. 18 రాష్ట్రాల రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలకే ముఖ్యమైన అంశాలతో భూభారతిని తయారు చేసినట్లు తెలిపారు. ఎక్కువగా భూములకు బౌండరీలు, మ్యాప్‌లు లేని కారణంగానే సమస్యలు తలెత్తుతాయన్నారు. భూ భారతి చట్టంలో సర్వేచేసి మ్యాపులు ఇచ్చి పాస్ బుక్‌లో అప్‌లోడ్ చేస్తే శాశ్వతంగా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. భూ భారతి చట్టాన్ని నిర్లక్ష్యం చేసినా, రైతులను ఇబ్బంది పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో 32 మండలాల్లో భూ భారతి చట్టం తీసుకు వచ్చామని జూన్ 2న దాని ఫలితాలు ప్రజలకు అందుతాయన్నారు. ఆగస్టు 15 నాటికి భూ సమస్యలు పరిష్కరించాలన్నిది ఈ చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ రోజు సాయంత్రం వరకు 6000 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 10956 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. పేదవారికి ఇల్లు నిర్మించాలన్న ధృడ సంకల్పంతో రాష్ట్రంలో మొదటి విడతగా 4,50,000 ఇండ్లు ఇస్తున్నామన్నారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ చిలప్‌చెడ్ మండలం పేరుకే మండలమని, ఇక్కడ ఒక్క ప్రభుత్వ భవనం కూడా లేదన్నారు. గత ప్రభుత్వం ధరణితో రైతులను గోస పెట్టిందని, ఇప్పుడున్న ప్రభుత్వమైనా అలా జరగకుండా చూడాలన్నారు. ఆధార్ కార్డు ఇచ్చినట్లే రైతులకు భూధార్ కార్డు ఇవ్వడం మంచిపరిణామన్నారు. చిన్న చిన్న సమస్యలకు రైతులు కోర్టుకు వెళ్తున్నారని, ఇప్పటికే 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. భూ భారతిలో సమస్యలు పరిష్కరింపబడితే 2 కోట్ల కేసులు తగ్గుతాయన్నారు. ఎమ్మెల్యే సునితారెడ్డి మాట్లాడుతూ.. గతంలో ధరణిలో చాలా సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. సాదాబైనామా కింద దరఖాస్తులు పెట్టుకున్నా వారికి భూ భారతిలో అవకాశం ఇవ్వాలని కోరారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ చిలప్‌చెడ్ మండలాన్ని రెవెన్యూ వివాద రహితంగా తీర్చి దిద్దుతామన్నారు. 16 రెవెన్యూ గ్రామాల నుంచి దాదాపు 1000 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ సహదేవ్, డీటీ సిందూజ, ఎంపీడీవో ఆనంద్ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కౌడిపల్లి, మే (ఆంధ్రజ్యోతి) 17: చిలప్‌చేడ్ మండలానికి వెళ్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మండల పరిధిలోని అంతారం గేట్ సమీపంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, నాయకులు మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు.



మంత్రి పొంగులేటితో మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి, నాయకులు

అకాల వర్షం..ఆగమాగం

- కూలిన వృక్షాలు.. తడిసిన ధాన్యం



తూప్రాన్‌లో కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు, వెంకటాయపల్లిలో రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు

తూప్రాన్/చిన్నశంకరంపేట/వెల్దుర్తి, మే 17(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో అకాల వర్షం రైతులను ఆగమాగం చేసింది. శనివారం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురియడంతో రైతులు రోడ్లపై ఆరబెట్టుకున్న వరి ధాన్యం కొట్టుకుపోయింది. బలమైన ఈదురు గాలులకు పెద్ద చెట్లు నేలకొరిగాయి. వివరాల్లోకి వెళ్తే.. తూప్రాన్ మండలంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘాలతో కమ్ముకొని ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. తూప్రాన్ పట్టణ శివారులోని హైవే బైపాస్‌లో రైతుల సర్వీసు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో రైతులు తొలగించుకున్నారు. తూప్రాన్ పట్టణంలోని ఏబీ కాలనీలో విద్యుత్ వైర్లు తెగిపోయి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా చిన్నశంకరంపేట, వెల్దుర్తి మండలాల్లోని పలు గ్రామాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయింది.

- శివ్వంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు చేతికొచ్చిన వరి ధాన్యం తడిసి మొలకెత్తిందని శనివారం మండల పరిధిలోని పిల్లుట్ల రైతులు నిరసన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారాన్ని ఇప్పించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు.

గూడ్స్‌లో రైలులో మంటలు



మిర్జాపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలులో మంటలను చల్లార్పుతున్న ఫైర్ సిబ్బంది

చిన్నశంకరంపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి రైల్వేస్టేషన్ వద్ద గూడ్స్ రైలులో శనివారం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. రైల్వే అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఆర్పడంతో ప్రమాదం తప్పింది. రైల్వే అధికారుల వివరాల ప్రకారం.. శనివారం ఉదయం రామగుండం నుంచి రాయచూరుకు బొగ్గు లోడ్‌తో ఉన్న గూడ్స్ రైలు బయలుదేరింది. ఈ క్రమంలో గూడ్స్ మిర్జాపల్లి రైల్వే స్టేషన్ చేరుకోగానే మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో రైలు బోగిల నుంచి మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. రైలును రైల్వే స్టేషన్లో నిలిపివేసి, కామారెడ్డి రైల్వే ఫైర్ సిబ్బందికి సమాచారమందించారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది సహాయంతో మంటలు అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని రైల్వే అధికారులు తెలిపారు. కాగా వాతావరణం వేడి తీవ్రతతో ఇలాంటి ఘటనలు జరుగుతాయన్నారు. గూడ్స్ రైలు ఐదు గంటలకు రాయచూరుకు బయలుదేరింది.

'మహీంద్రా'లో అగ్నిప్రమాదం



స్టోర్‌లో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జహీరాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహీంద్రాకర్మాగారంలో శుక్రవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. కర్మాగారం ఆవరణలో ఎకరాస్థలం విస్తీర్ణంలో ఉన్న స్టోర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడి ప్రమాదం చోటుచేసుకున్నది. కర్మాగారంలో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఐదు ఫైర్‌ఇంజన్ల సాయంతో మంటలను అదుపు చేశారు. రాత్రి 12గంటల నుంచి తెల్లవారు జామువరకు మంటలను ఆర్పేందుకు అధికారులు యత్నించారు. కాగా పెద్దఎత్తున నష్టం జరిగినట్లు కంపెనీవర్గాలు, స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదం రాత్రిపూట జరగగా, అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

ఆడుకునేందుకు వెళ్లి పిడుగుపాటుకు బలి

- ఇద్దరు పిల్లల మృతితో పడాలపల్లిలో తీవ్ర విషాదం
- కన్నీరు మున్నీరైన మృతుల కుటుంబాలు



మృతి చెందిన ప్రసాద్, యశ్వంత్



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవికిరణ్ ఆరోగ్యపరిస్థితిపై వివరాలను తెలుసుకుంటున్న అధికారులు

తూప్రాన్, మే 17(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లిలో పిడుగుపాటుకు గురై ఇద్దరు చిన్నారుల మృతి తీవ్ర విషాదాన్ని నింపింది. వేసవి సెలవులు రావడంతో చిన్నారులు పడాలపల్లికి చెందిన పంబాల ప్రసాద్ (15), నడిపల్లి యశ్వంత్ (13), మొకద్దం రవి కిరణ్ (12) గ్రామానికి వచ్చారు. శనివారం గ్రామశివారులో వారు మరికొంతమందితో కలిసి క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో చెట్టుకింద చేరిన ముగ్గురు చిన్నారులు పిడుగుపాటుకు గురయ్యారు. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మొకద్దం రవికిరణ్ తీవ్ర గాయాలకు గురయ్యాడు. రవికిరణ్‌ను మెరుగైన వైద్యం కోసం ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా మృతి చెందిన చిన్నారులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి, శవాలను కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి తూప్రాన్ ఆసుపత్రి వద్దకు విచ్చేసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ. 10వేల చొప్పున అందజేశారు.

కూలీ పనులు చేస్తూ..

పడాలపల్లికి చెందిన పంబాల లక్ష్మి కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులు, ఓ కూతురును పోషిస్తూ చదివిస్తున్నది. పిల్లల చిన్నతనంలో భర్త ముత్యాలు మృతి చెందాడు. చిన్న కుమారుడు ప్రసాద్ ఇటీవలే పదవ తరగతి పూర్తి చేసుకున్నాడు. పిడుగుపాటుకుగురై మరణించడంతో లక్ష్మి రోదనలు మిన్నంటాయి.

పుత్ర శోకం..

పడాలపల్లికి చెందిన నడిపల్లి లక్ష్మీఐలయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. రెండో కొడుకు గతంలో మృతి చెందాడు. శనివారం పిడుగుపాటుకు పెద్ద కొడుకు యశ్వంత్ (13) మృతిచెందాడు. యశ్వంత్ ఇటీవల 8వ తరగతి పూర్తయ్యింది. కొడుకు మృత్యువాత పడటంతో కుటుంబంలో శోకాన్ని మిల్చింది.




ఆయుర్వేద ఆసుపత్రిలో డాక్టర్ నియామకం



ఆసుపత్రిలో డాక్టర్ శ్రీవాణితో కలిసి స్థానికులతో మాట్లాడుతున్న ఆయుష్ శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్. పరమేశ్వర్ నాయక్

అల్లాదుర్గం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వచ్చే నెలలో పూర్తి స్థాయిలో నియామకం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయుర్వేద, ఆయూష్ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్. పరమేశ్వర్ నాయక్ స్పష్టం చేశారు. అల్లాదుర్గం ఈ నెల 16న 'ఈ ఆసుపత్రులకు పూర్వ వైభవం ఎప్పుడో..?' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో గత మూడేళ్లుగా మూతపడిన మండలంలోని ఆయుర్వేద ఆసుపత్రులపై కథనానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. మూతపడిన ఆయుర్వేద ఆసుపత్రులను తెరిపించి వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో శనివారం ఆయుర్వేద, ఆయూష్ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్. పరమేశ్వర్ నాయక్ స్వయంగా ముప్పారం గ్రామంలోని ఆయుర్వేద ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వచ్చే నెలలో పూర్తి స్థాయిలో నియామకం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ మేరకు జూన్ నెలలో 57 మంది వైద్యులను నియమించనున్నట్లు తెలిపారు. ముప్పారంలోని ఆయుర్వేద ఆసుపత్రిలో డాక్టర్‌తో పాటు, ఓ ఫార్మసిస్టు, ఓ అటెండర్ పోస్టులను తక్షణమే భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. కాగా ముప్పారంలోని ఆయుర్వేద ఆసుపత్రిలో నూతన వైద్యురాలిగా డాక్టర్ శ్రీవాణికి అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పరమేశ్వర్ నాయక్ బాధ్యతలను అప్పగించారు. మంత్రి దామోదర రాజనర్సింహకు, సమస్యను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు

బైకుల దొంగ అరెస్ట్.. వాహనాలు స్వాధీనం



బైకుల దొంగ అరెస్టును చూపుతున్న పోలీసులు

జహీరాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): బైకుల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం పట్టణంలోని పస్తాపూర్‌కమాన్ వద్ద పోలీసులు వాహన తనఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బీదర్‌కు చెందిన కైలాష్ ద్విచక్రవాహనం(టీఎస్15-ఈజీ7502)పై జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు బయలుదేరాడు. అతడిని ఆపి తనిఖీ చేయగా వాహనానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేవని చెప్పాడు. అనుమానించిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా రెండు ద్విచక్రవాహనాలు(ఏపీ28-బీటీ8124, టీజీ08-సీ4094) సైతం దొంగిలించినట్టు కైలాష్ అంగీకరించాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనంచేసుకున్నట్టు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



కరుణాకర్(ఫైల్)

గజ్వేల్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని జాలిగామలో శనివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిట్యాల కరుణాకర్(34) గజ్వేల్‌లోని ఓ వాటర్ ప్లాంట్‌లో పని చేసేవాడు. ఈ నెల 14న రాత్రి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రోడ్డుపై పోసిన వరికుప్పలను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.

న్యూస్ బాక్స్

చిన్నారుల ఐడియా అదిరింది



చుట్టూ చీర చుట్టుకొని క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

దౌల్తాబాద్, మే17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వైసవి సెలవులు రావడంతో చిన్నారులు రకరకాల ఆటలు ఆడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. కొంత మంది చిన్నారులకు చిన్నప్పటి నుంచే క్రికెట్‌పై పిచ్చితో, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలను స్ఫూర్తిగా తీసుకుని చిన్నప్పటి నుంచే క్రికెట్ నేర్చుకుంటున్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని హైమద్ నగర్ గ్రామ రోడ్డు పక్కనే చిన్నారులు కట్టెలు పాతుకొని చుట్టూ చీర చుట్టి బాల్ ఎక్కడి పోకుండా నెట్‌లాగా చేసుకొని చిన్నారులు క్రికెట్ ఆడుతుంటే ఆంధ్రజ్యోతి కెమారాకు చిక్కింది.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మిరుదొడ్డి, మే17 (ఆంధ్రజ్యోతి): రాబోతున్న రోజుల్లో ఉన్నతశిఖరాలను అధిరోహించి, నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని వీరారెడ్డిపల్లి చార్వకస్కూల్ ప్రిన్సిపాల్ కుమార్ అన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కట్లే రేవతి, పంజనవ్యలు ఎపీ ఈసెట్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి, రెండవ ర్యాంకులను సాధించిన విద్యార్థులకు శాలువతో సన్మానించి, అభినందించారు. ఇదేస్ఫూర్తిలో ఉన్నతశిఖరాలను అధిరోహించాలని కోరారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలంలో విచ్చలవిడిగా ఏర్పాటైన బెల్టుషాపులను నియంత్రించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఎక్సైజ్ సీఐకి శనివారం వినతిపత్రం సమర్పించారు. బెల్టుషాపుల్లో 24 గంటలు మద్యం లభిస్తుండటంతో చాలా మంది మద్యానికి బానిసై ఆర్థికంగా చితికిపోతున్నారని తెలిపారు. అలాగే వైన్స్ పర్మిట్‌రూమ్‌ల్లో కుర్చీలు, టేబుళ్ల సౌకర్యం ఉండకూడదని, కాని నిబంధనలను అతిక్రమిస్తూ వీటిని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అక్రమంగా ఏర్పాటైన బెల్టుషాపులను నియంత్రించాలని కోరారు.

చేర్యాల తహసీల్దారుగా దిలీప్ నాయక్

చేర్యాల, మే17 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల తహసీల్దారుగా దిలీప్ నాయక్ శనివారం విధులలోకి చేరారు. ఈసందర్భంగా కార్యాలయ రికార్డులలో సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలముందు ఇక్కడికి వచ్చిన మహమ్మద్ సమీర్ అహ్మద్‌ఖాన్‌ను ఆసిఫాబాద్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కొండపాక తహసీల్దారు దిలీప్ నాయక్ నియమించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభ యాత్ర

బెజ్జంకి, మే 17 (ఆంధ్రజ్యోతి):బెజ్జంకి మండల కేంద్రంలో హనుమాన్ దీక్షాపరులు భక్తి శ్రద్ధలతో శనివారం హనుమాన్ శోభా యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా హనుమాన్ విగ్రహంతో శోభా యాత్ర కొనసాగింది. హనుమాన్ దీక్షాపరులు జై హనుమాన్, జై శ్రీరామ్ అంటూ భక్తి పాటలతో నృత్యాలు చేశారు.

తమలపాకుల నాగవల్లి దళార్చన



దుబ్బాక, మే 17 (ఆంధ్రజ్యోతి):దుబ్బాక పట్టణంలోని కోరమీసాల హనుమాన్‌దేవాలయంలో శనివారం ఘనంగా హనుమాన్ పూజలను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ స్వాముల ఆధ్వర్యంలో స్వామివారి మూలమంత్ర హావనం, సిందూర అభిషేకం, తమలపాకులు నాగవల్లి దళార్చనతో పాటు స్వామివారి పారాయణం కూడా జరిగింది.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో జాప్యం

● త్వరలో ముగియనున్న చెక్కుల కాలపరిమితి



రాయపోల్ మండల రెవెన్యూ కార్యాలయం

రాయపోల్, మే 17 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడపిల్లల పెళ్లి భారాన్ని కొంతవరకు తగ్గించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలు చేస్తుంది. ఈ పథకం ద్వారా పెళ్లికూతురు కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల నగదు సహాయాన్ని అందజేస్తున్నది. సుమారు 15 రోజుల క్రితం రాయపోల్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాయి. చెక్కులు పంపిణీకి సిద్ధంగా ఉన్నప్పటికీ లబ్ధిదారులకు అందజేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. సుమారు మరో 20 రోజుల్లో చెక్కుల కాలపరిమితి ముగియనున్నట్లు తెలిసింది. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో కూడా ఒకసారి రాయపోల్ మండలంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ జాప్యం జరగడంతో అవి ల్యాప్స్ కాగా వెనక్కి పంపించి తిరిగి కొత్తవి తెప్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లబ్ధిదారులు బ్యాంకులో చెక్కులను డిపాజిట్ చేసిన తర్వాత కొన్ని సందర్భాల్లో అవి క్లియరెన్స్ కావడానికి కనీసం వారం నుంచి పది రోజుల టైం పట్టే అవకాశం ఉంది. కాలపరిమితి దగ్గరలో ఉన్నప్పుడు పలు బ్యాంకుల్లో డిపాజిట్ చేసే వారికి ఇచ్చిన చెక్కులు చెల్లకుండా పోయే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు వెంటనే స్పందించి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ కృష్ణమోహన్‌ను వివరణ కోరగా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయడం కోసం ఎమ్మెల్యేకు సమాచారం ఇచ్చామని తెలిపారు. త్వరలోనే వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులతోనే పాఠశాలలు పటిష్టమవుతాయి

సిద్దిపేట కల్చరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బలోపేతం అయితేనే విద్యార్థులు విజ్ఞానవంతులవుతారని తద్వారా ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ పటిష్ఠం అవుతుందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం చేపట్టిన ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల వృత్త్యంతర శిక్షణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి శనివారం సందర్శించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న గణితం, ఆంగ్ల ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. శిక్షణలో భాగంగా కంటెంట్, ఐసీటీ, మెథడాలజీకి సంబంధించిన అంశాలను, చక్కగా తెలుసుకుని, వాటిని పాఠశాలల్లో అమలు చేయవలసిందిగా సూచించారు. విద్యార్థులు విస్తృతంగా చదివేలా ప్రోత్సహించి వీలైనంతమటుకు, స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్ అంశాలపై దృష్టి పెట్టి, విద్యార్థి స్వీయ పాఠకుడు అయ్యేలా శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు. గణిత ఉపాధ్యాయులు లాజికల్ మాథెమాటిక్స్ దృష్టి, పెట్టి గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు మరింత నైపుణ్యవంతులుగా తయారు చేసేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు శిక్షణ పొందుతూ, చక్కని ప్రణాళికతో బోధిస్తూ, శిక్షణానంతరం వాళ్ళల్లో వచ్చిన మార్పుని, ఎలాంటి ప్రాక్టీసెస్ చేస్తున్నారు అన్న అంశాన్ని, ఇంపాక్ట్ స్టడీలాగ నిర్వహించి రాబోయే కాలంలో మరింత నైపుణ్యవంతమైనటువంటి శిక్షణను తీసుకోవాల్సిందిగా తెలియజేశారు.

స్కావెంజర్ల పెండింగ్ వేతనాలు విడుదల చేయండి

● కలెక్టర్‌కు టీపీటీఎఫ్ వినతి పత్రం

సిద్దిపేట కల్చరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిశుభ్రత కోసం పనిచేస్తున్న స్కావెంజర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతి పత్రం సమర్పించారు. పాఠశాలల పరిశుభ్రత కోసం స్కావెంజర్లను నియమిస్తూ, వారికి పది నెలల వేతనాలు అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చారని ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఆరు మాసాలకు సంబంధించిన వేతనాలు మాత్రమే విడుదల అయ్యాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు మాసాల వేతనాలు విడుదల చేయాలని కోరారు. అలాగే 6, 7తరగతులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌లను అందించాలని, పాఠశాలల్లో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించాలని, పాఠశాలల్లో గణిత ల్యాబ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సిద్దిపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యాదర్శి సత్యనారాయణ ఉన్నారు.

కొనుగోళ్లు ముగిసేటప్పుడు టోల్‌ఫ్రీ నంబర్లా?



టోల్‌ఫ్రీ నంబర్లతో కూడిన బ్యానర్ ఏర్పాటు

మద్దూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ధాన్యం కొనగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల దగ్గర పడుతున్న సమయానా రైతుల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ల బ్యానర్ ఏర్పాటు చేయడంతో రైతులు అవాక్కవుతున్నారు. మండలంలోని 10 గ్రామాల్లో ఐకేపీతో పాటు సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల ఏర్పాటు చేశారు. రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లు, తూర్పారా పట్టే మిషన్లు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని ప్రారంభానికి ముందే జిల్లా కలెక్టర్ స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేసినా ఎక్కడా టార్పాలిన్ కవర్లతో పాటు పాడైన తూర్పారా పట్టే మిషన్లకు మరమ్మతుల చేయించడంలో అలస్యం చేసినట్లు రైతులు ఆరోపించారు. అకాల వర్షాలతో రైతులు అతలాకుతలం అయిన సందర్భాల్లో ఏ ఒక్క అధికారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించింది లేదని రైతులంటున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి వివరాలు అడిగి వెళ్లారే తప్ప రైతుల సమస్యల్ని పట్టించుకున్నది లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్ల ముగుస్తున్న సమయాల్లో టోల్‌ఫ్రీ నెంబర్లతో కూడిన బ్యానర్ ఏర్పాటు చేసి ఏవేని సమస్యలుంటే ఈ టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేయాలని చెప్పడం శోచనీయంగా మారిందంటున్నారు.

ఎంపీని అవమానించిన దేవాదాయ అధికారులపై చర్యలు తీసుకోవాలి

● డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

గజ్వేల్, మే 17 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను అవమానించిన దేవాదాయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆయన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీస్ జారీ చేసి, ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. సరస్వతీ పుష్కరాల్లో భాగంగా ముద్రించిన ఆహ్వాన పత్రికల్లో ఎంపీ ఫోటో పెట్టకపోవడం, ఆహ్వానించకపోవడం తగదన్నారు. ఓ ఎంపీ పట్లనే వివక్ష కొనసాగితే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన దేవాదాయ శాఖ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల చట్టం కింద కేసు నమోదు చేయాలన్నారు. వారితో హైకోర్టు న్యాయవాది దివాకర్‌పూలే తదితరులున్నారు.

ఘనంగా హనుమాన్ యజ్ఞాలు



ఎల్లదాసునగర్ కాలనీ హనుమాన్ దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న మాలాధారులు

చేర్యాల, మే 17 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని ఆది ఆంజనేయస్వామి దేవాలయంతో పాటు కొమురవెల్లి మండలం ఐనాపూర్, గురువన్నపేట తదితర గ్రామాలలో హనుమత్ యజ్ఞాలను హనుమాన్ మాలాధారణస్వాములు శనివారం అత్యంత భక్తిప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా దేవాలయాలలో హనుమంతుడు, సీతాసమేత రాముడు, లక్ష్మణ దేవతామూర్తులకు పట్టు వస్త్రాలు, పూలమాలలు అలంకరించారు. శాస్త్రోక్తయుక్తంగా చందనాభిషేకం జరిపి పల్లకిసేవ నిర్వహించారు. శ్రీరామ, హనుమాన్ నామస్మరణ, భజనలతో తన్మయత్వం చెందారు. చేర్యాల మండలం వేచరేణి శివారు ఎల్లదాసునగర్ కాలనీలోని హనుమాన్ దేవాలయంలో కి మద్యంమత్తులో ప్రవేశించి హనుమాన్ విగ్రహంపై పాదంమోపి అపచారానికి పాల్పడిన నేపథ్యంలో శనివారం ఆలయంలో హనుమత్‌యజ్ఞం నిర్వహించారు. ప్రముక వక్త దేశపతి ఆమోఘ్ యజ్ఞానికి హాజరై హిందు సంస్కతి, సంప్రదాయాల పరిరక్షణకు పాటుపడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తెలిపారు.

సబ్‌సెంటర్లలో బీపీ మాత్రలు లేవు



మందుల కొరతపై ఆరా తీస్తున్న సీపీఎం నాయకులు

మద్దూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలతో పాటు సబ్‌సెంటర్లను ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నా మందుల కొరత వేధిస్తున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి మండిపడ్డారు. శనివారం మద్దూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా మందులు అందుబాటులో ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలతో పాటు సబ్‌సెంటర్ల పరిధిలో వందలాది మంది బీపీ, షుగర్ వ్యాధులతో బాదపడుతున్నారని, ఇలాంటి వారి కోసం ప్రాథమిక ఆరోగ్యకేంద్రల పరిధిలోని సబ్‌సెంటర్ల ద్వారా బీపీ, షుగర్ మందులు అందుబాటులో లేకుండా పోవడంతో ఆందోళనకు గురవుతున్నారన్నారు. బీపీ మందులు లేకుండా పోవడంతో పక్షవాతం బారిన పడే అవకాశం ఉందని, మందుల కొరత లేకుండా చూడాలని కోరారు.

రహదారి వేశారు.. కల్వర్టు నిర్మాణం మరిచారు



దుబ్బాక మండల పద్మాశాలిగడ్డ గ్రామంలో ఇటీవల ఎన్‌ఆర్‌జీఎస్ కింద పదిలక్షలతో సిమెంట్ రహదారిని నిర్మించారు. గ్రామంలోని ఒక వీధిగుండా ప్రధాన రహదారికి వచ్చే రహదారి సిమెంటు హంగులను అద్దుకున్నా... కల్వర్టులను మరిచారు. పంచాయతీరాజ్ ఇంజనీర్ అధికారులు కలెక్టర్ ఇచ్చిన ప్రొసిడింగ్‌లకు విరుద్ధంగా సిమెంట్ రహదారులను నిర్మించి, పక్కన మురికికాలువలు, కల్వర్టులు నిర్మించకుండా చేతులు దులుపుకున్నారు. దీంతో వేగంగా వచ్చే వాహనాలు గుంతలోపడి ప్రమాదాలకు కారణమవుతాయనే భయాందోళన ప్రజల్లో ఉంది

- దుబ్బాక(ఆంధ్రజ్యోతి)

చిత్తడిగా కడవేరుగు దారి

● వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం



చేర్యాల-కడవేరుగు ప్రధానరహదారి దుస్థితి

చేర్యాల, మే 17 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలో శనివారం తెల్లవారుజామున బలమైన ఈదురుగాలులతో కూడి న వర్షం కురిసింది. ఉరుములు, మెరుపుల శబ్దాలతో దద్దరిల్లడంతో ప్రజలు తీవ్రభయాందోళకు గురయ్యారు. పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని టీ హోటల్ స్టాండ్‌లు నేల కూలాయి. షరామామూలుగా గాంధీచౌక్ కల్వర్టు, అంగడిబజారు చౌరస్తాలో డ్రైయిన్ నీరు నిలిచాయి. స్థానిక శ్వేత ఆస్పత్రి సమీపంలో సైడ్‌డ్రైయిన్ వాల్‌సరిగా నిర్మాణం చేపట్టకపోవడంతో కోతకుగురై ఫ్లోరింగ్ టైల్స్ కుంగిపోయింది. అలాగే పట్టణశివారు ఊట్లపల్లి వారి వీధికివెళ్లేమార్గంలో చేర్యాల- కడవేరుగు ప్రధాన రహదారిపై ఇసుకమేటతో పాటు బురద పేరుకుపోయింది. చిత్తడిగా మారడంతో వాహనాల రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. చీకటి వేళ ప్రమాదకరపరిస్థితి నెలకొంది.

అంబేడ్కర్, గద్దర్‌లది ఒకే సిద్ధాంతం

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ములుగు, మే 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే ఆ రాజ్యాంగంలో ఉన్న విధి విధానాలు అమలు పరిచే విధంగా పోరాటం చేసిన వ్యక్తి ప్రజా గాయకుడు గద్దర్ అని వారిద్దరిది ఒకే సిద్ధాంతమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య, సంస్కృతిక సారధి చైర్మెన్ వెన్నెల తెలిపారు. శనివారం ములుగు మండల పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ మామిడాల గ్రామంలో అంబేడ్కర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎడ్ల సత్తయ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాల ఏర్పాటు కోసం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య సాంస్కృతిక సారధి చైర్మెన్ వెన్నెల హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఇద్దరు మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన అంబేడ్కర్ గ్రామ కమిటీ సభ్యులను అభినందించారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌లో కోతలు సరికావు



గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 17 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్‌కు సంబంధించిన నిధుల విడుదలలో కోతలు విధించడం సరికాదని గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 47 మంది బాధితులకు రూ.13లక్షల 13వేల విలువ చేసే చెక్కులను ఆయన శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం సహాయనిధి చెక్కుల మంజూరీలో గరిష్ఠ మొత్తాన్ని ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం అవుతుందని, గజ్వేల్ పట్టణానికి చెందిన గుంటుకు బాలకృష్ణ రూ.47 లక్షల ఖర్చుతో సీఎం సహాయనిధికి అప్లై చేస్తే కేవలం రూ.60వేలు మంజూరు చేయడం సరికాదన్నారు. ఆపదలో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి గరిష్ఠ మొత్తాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, తదితరులున్నారు.

బీజేపీ నాయకుల తిరంగ యాత్ర



బెజ్జంకి, మే 17 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్‌లో పర్యాటకులపై చేసిన ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్‌పై యుద్ధప్రతిమను చాటిన దేశ రక్షణ వ్యవస్థ ప్రపంచ దేశాలకు తెలిసిందని బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా శనివారం బెజ్జంకి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు తిరంగ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అమర జవాన్‌లకు నివాళులార్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏక్షణంలోనైనా ఉగ్రదాడిని ఎదుర్కోనేందుకు దేశ రక్షణ వ్యవస్థ సిద్ధంగా ఉందన్నారు. దేశ భద్రత కోసం ప్రధాని మోదీ ఆపరేషన్ సిందూర్‌తో ప్రత్యర్థి దేశాలకు గుణపాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరివెద మహిపాల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

హుస్నాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలుంటాయని హుస్నాబాద్ ఏసీపీ సదానందం హెచ్చరించారు. శనివారం సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్, టీచర్స్ కాలనీల్లో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో మాట్లాడారు. ప్రజలకు రక్షణ, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీంతో ప్రజల సమస్యల నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇత మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు కాలనీల్లో అనూమాన స్పదంగా కనపడినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలను వివరించారు. ఎలాంటి పేపర్లు లేని 73 మోటర్ సైకిళ్ళు, మూడు ఆటోలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు అభిలాష్, విజయభాస్కర్, నవీన్ పోలీసు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యం.. రోడ్డెక్కిన రైతులు



సిద్దిపేట-ముస్తాబాద్ రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

సిద్దిపేట రూరల్, మే17 (ఆంధ్ర,జ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం సిద్దిపేట రూరల్ మండలం బండచేర్లపల్లి పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సిద్దిపేట-ముస్తాబాద్ రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి ఇరువై రోజులు కావస్తున్నా తూకం వేయడంలో జాప్యం జరుగుతుందని, తూకం వేసే కాంటా ఒకటే ఉండడంతో అలస్యం అవుతుందని ఆరోపించారు. అకాల వర్షాలకు ధాన్యం అడుగులు తడుస్తూన్నాయని, తూకం అలస్యం కావడం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు అవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ నల్ల నరేందర్ రెడ్డి రాస్తోరోకో చేస్తున్న రైతులతో మాట్లాడారు. ధాన్యం తూకం వేసేందుకు అదనంగా మరోక కాంటాను ఏర్పాటు చేయిస్తానని, .దాన్యం కొనుగోళ్ల వేగవంత అయ్యేలా చూస్తానని హమీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

సరిలేరు మీకెవ్వరు

(5వ పేజీ తరువాయి)

కేటాయించారు. అలాగే కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప ఆలయానికి స్థలాన్ని అందజేశారు. అయితే, పట్వారీ కల్వకోట సురేందర్‌రావుకు ఆంధ్రజ్యోతి దినపత్రిక అంటే వల్లెమాలిన అభిమానం. కొన్నాళ్ల క్రితం అస్వస్థతకు గురై మంచాన పడి అంత్యదశలోనూ ఆంధ్రజ్యోతి దినపత్రికను చదవడం వీడలేదు.

వారి సేవలకు నిరాదరణ

చేర్యాల అభివృద్ధి బావుటాలో మామఅల్లుళ్లు అయిన గుళ్లపల్లి తిరుమల యాదగిరిరావు, కల్వకోట సురేందర్‌రావుది విశేషమైన స్థానం. ఎప్పటికీ మరువలేనిది. ఇంత కృషి చేసినా పాలకులు, అధికారులు మాత్రం వారికి తగిన గుర్తింపును ఇవ్వకపోవడంపై కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారుఅందించిన స్థలాలలో రూపుదిద్దుకున్న కార్యాలయాల ఆవరణలో యాదగిరిరావు, సురేందర్‌రావు విగ్రహాలతో పాటు దాతల పేర్లుతో శిలాఫలకాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్యాలయ శిలాఫలకాలపై పేర్లు పొందుపరచాలని అధికారులకు సూచించారు. కానీ అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఎవరూ పట్టించుకోలేదు. చాలా ఏళ్ల క్రితమే యాదగిరిరావు మరణించగా, కొన్నినెలల క్రితం సురేందర్‌రావు కూడా కన్నుమూశారు. చేర్యాల అభివృద్ధి ప్రదాతల దాతృత్వాన్ని నేటితరానికి తెలియజేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.